27న గిరిజన సాధికారితపై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

షెడ్యూలు గిరిజన (ఎస్టీ) సాధికారిత, అత్యాచారాల నియంత్రణ తదితర అంశాలపై అవగాహన సదస్సు ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్మెంట్ (సిఐడి) విశాఖ ప్రాంతీయ కార్యాలయం డెప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం.ఎన్.భూపాల్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అవగాహన సదస్సును ఈ నెల 27న స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సదస్సులో రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకర రావు, జిల్లా కలెక్టర్, ఎస్పి, ఐటిడిఎ పిఒ తదితరులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సదస్సును సిఐడి పౌరహక్కుల రక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఉరితాళ్లతో నిరసన

ఒపిఎస్‌ను నిరసిస్తూ

మెడకు ఉరితాళ్లు బిగించుకొని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌కు బదులు ఒపిఎస్‌ను తీసుకురావడాన్ని నిరసిస్తూ ఫ్యాప్టో, ఎపిసిపిఎస్ఇఎ పిలుపు మేరకు శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు మెడకు ఉరితాళ్లు వేసుకొంటూ నిరసన తెలిపారు. ఈ నిరసనను ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు మాట్లాడుతూ వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ తీసుకొస్తానని చెప్పి ఉద్యోగులను, ఉపాధ్యాయులను, వారి కుటుంబ సభ్యుల ఓట్లు గుంజుకొని జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టారన్నారు. కానీ ఇప్పుడు సిపిఎస్‌కు ప్రతిరూపంగా ఉన్న జిపిఎస్ తీసుకురావడమంటే ఉద్యోగులను, ఉపాధ్యాయులను మోసగించడమేనన్నారు. ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎపిటిఎఫ్(257), ఎపిటిఎఫ్ (1938) సంఘ సభ్యులు పిసిహెచ్ శ్రీనివాసరావు, నల్ల బాలకృష్ణ, ఎం.శివున్నాయుడు, ఎపిసిపిఎస్ఇఎ నాయకులు బి.సంతోష్ మాట్లాడుతూ 25న జరిగే చలో కలెక్టరేటును ఉపాధ్యాయులు, ఉద్యోగుల విజయవంతం చేయాలని కోరారు. ఈ నిరసనకు సంఘీభావంగా పిఆర్‌టియు నాయకులు కె.విజయ్ పాల్గొన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిపిఎస్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పాలకొండ ఫ్యాప్టో నాయకులు ఎస్.వాసుదేవరావు, జి.సూర్యనారాయణ, టి.ఉమామహేశ్వరరావు, బివి రమణ, కె.పద్మజ, ఎ.నాగరాజు, వీరఘట్టం ఫ్యాప్టో నాయకులు పైడిరాజు, కె.గోవిందరావు, స్వామిబాబు, సీతంపేట ఫ్యాప్టో నాయకులు కె.కృష్ణారావు, ఎ.రామారావు, ఎపిసిపిఎస్ఇఎ నాయకులు కెసిహెచ్ అప్పలనాయుడు, ఎ.రాంబాబు, అన్నాజీ, సుధాకర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారంలో సిపిఎస్ రద్దు చేస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీని మరిచి నాలుగేళ్ల అధికారం తర్వాత ఇప్పుడు జిపిఎస్ కొత్త విధానాన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలు వ్యతిరేకిస్తున్నా బలవంతంగా ప్రభుత్వం ప్రతిపాదించడం, క్యాబినెట్ అంగీకారం తెలపడం ఉపాధ్యాయ ఉద్యోగ వర్గాలను మోసగించడమేనన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ బుచ్చయ్యకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి.పరాంకుశం నాయుడు, జి.జయలక్ష్మి, కెడికె మోహన్, ఎం.సంపత్ కుమార్, ఎస్వీ రమణ, జి.మోహన్ రావు, కామరాజు, కాంతారావు, కోటేశ్వరరావు, కె.పారయ్య, వి.రాంబాబు పాల్గొన్నారు.

సాలూరు : జిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ శనివారం ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఫ్యాప్టో నాయకులు బి.విజయకుమార్, కె.జానకీరావు ఆధ్వర్యాన ఉపాధ్యాయులు వై నాట్ ఒపిఎస్ అంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్‌తో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను తప్పుతోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. ఒపిఎస్‌తో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగుతుందని నాయకులు విజయకుమార్ హెచ్చరించారు.

సాలూరులో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

జెఎఎస్ సర్వే పక్కాగా జరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి - సీతానగరం

జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) సర్వే పక్కాగా జరగాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను మండలంలోని చినభోగిలిలో శని వారం పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా ఇంటింటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లడం, నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలను తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఏ ఒక్కరూ తప్పిపోరాదని ఆయన స్పష్టం చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలందరికీ ఆరోగ్య భరోసా దక్కుతుందని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించడం, అవసరమైన వారికి గ్రామాల్లోనే ఆరోగ్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందించడం, పెద్ద ఆస్పత్రులకు సిఫార్సు చేయడం లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని రూపకల్పన చేశారని వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్దనే ఏడు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇంటింటికి ఆరోగ్య సర్వేలో ప్రతి గ్రామ, వార్డు సచివాయంలో ఎఎన్ఎం, ఆశాలు ఒక బృందంగా, సిహెచ్ఒలు, ఆశా కార్యకర్తలు మరో బృందంగా ఏర్పడి ప్రతి ఇంటినీ సర్వే చేయాలని స్పష్టం చేశారు. ఇంటి వద్ద ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను తనిఖీ చేసి వారి జాబితా తయారు చేయాలని సూచించారు. ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్న వైద్య శిబిరాలకు ఒపి చీటిలను అవసరమైన అందరికీ అందించాలని ఆదేశించారు. శిబిరంలో వైద్య నిపుణులు ఉంటారని, అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని, శిబిరంలో మరో ఏడు రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. జెఎఎస్ శిబిరాలు విజయవంతం కావాలని ఆయన అన్నారు. ఆరోగ్య శిబిరాలకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల నుండి ఒక స్పెషలిస్టు డాక్టర్ హాజరవుతారని చెప్పారు. నెల రోజులపాటు ప్రతి రోజూ శిబిరాలు జరుగుతా యన్నారు. మండలానికి ఒక గ్రామం చొప్పున రోజూ వైద్య శిబిరాలు కొనసాగుతాయని వెల్లడించారు. దీనివల్ల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి గ్రామాల్లోనే స్పెషలిస్టు వైద్యులతో సత్వర వైద్యం అందుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వైద్య శిబిరం జరుగుతున్న ప్రతి చోటా ఔషధాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అన్ని రకాల వైద్య పరికాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. కార్యక్రమం విజయవతంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డా బగాది జగన్నాథ రావు, తహశీల్దార్ ఎంవి రమణ, ఎంపిడిఒ ప్రసాద్, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

అంగన్వాడీ నాయకురాలి గృహనిర్బంధం

సాలూరు : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25న చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో శనివారం పట్టణ పోలీసులు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకులు బి.రాధను గృహ నిర్బంధంలో ఉంచారు. చలో విజయవాడకు వెళ్లకుండా ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలు, నాయకులను ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు చేయిస్తోంది.

రోల్‌మోడల్‌గా నిలవాలి

ఉపాధ్యాయులకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ సూచన

ప్రజాశక్తి-విజయనగరం

ఉపాధ్యాయులు విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్ది రోల్‌మోడల్‌గా నిలవాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సూచించారు. విద్యార్థులతో సరిగా వర్కుబుక్స్ రాయించకపోవడం, ఉపాధ్యాయులు సరిగా కరెక్షన్ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం విజయనగరంలోని కస్పా హైస్కూల్, ఆర్‌కె ప్రాథమిక పాఠశాల, 15వ నెంబరు సచివాలయం, డెంకాడ మండలం మోపాడ కెజిబివి పాఠశాలను పరిశీలించారు. పర్యటనంతా ఉపాధ్యాయులను హెచ్చరిస్తూ సాగింది. బోధనపైనా, విద్యార్థులకు అందుతున్న విద్యపైనా ఏ విధంగా పర్యవేక్షణ చేస్తున్నారో తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. తొలుత కస్పా హైస్కూలుకు చేరుకున్న ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులు వర్క్‌బుక్స్ కరెక్షన్స్ సరిగ్గా చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పిలి వీధిలో గల సచివాలయాన్ని పరిశీలించి ఉద్యోగులందరినీ బయటకు రప్పించి, వీధిలో రోడ్డు మీద మాట్లాడారు. వాలంటీర్లు ఒక్కొక్కరిని పిలిచి మీ పరిధిలో ఎన్ని ఇల్లు ఉన్నాయి,వాటిలో ఎంత మంది చదువుతున్నారు, ఎంత మంది చదువు మానేశారు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డెంకాడ మండలం మోపాడ లోని కెజిబివిని ప్రవీణ్ ప్రకాష్ పరిశీలించారు.

మార్గదర్శకాలకు మార్పులు జరగాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పుల ప్రతిపాదనలు కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా జరగాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులపై ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల అవసరాలు అన్ని కోణాల్లో పరిశీలించి ప్రతిపాదించాలని స్పష్టం చేశారు. ఇవిఎంల అవసరాలు, భద్రత, రవాణా, అవసరమగు సిబ్బంది, గ్రామాల మధ్య దూరం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఒక గ్రామానికి చెందిన ఓటర్లు అదే గ్రామంలో ఓటు వేసే అవకాశం ఉండాలని స్పష్టం చేశారు. ప్రతిపాదనలు తక్షణం సమర్పించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, డిఆర్ఒ జె.వెంకట రావు, హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు డి.రవి కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, టిడిపి, జనసేన, వైసిపి, సిపిఐ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, పైల.శ్రీనివాస రావు, ఎం.గౌరీ శంకర్ రావు, ఈదుబిల్లి వెంకట నాయుడు పాల్గొన్నారు.

ఉక్కును ప్రైవేటీకరిస్తే ఊరుకునేది లేదు

ప్రజాశక్తి - సీతంపేట/పాలకొండ

విశాఖ ఉక్కును ప్రయివేటు పరం చేస్తే ఊరుకునేది లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం హెచ్చరించారు. సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన ఉక్కు రక్షణ బైక్ యాత్ర శ్రీకాకుళం జిల్లా పాతపట్నం, కొత్తూరు మీదుగా శనివారం రాత్రి సీతంపేట, పాలకొండకు చేరుకుంది. సీతంపేటలోని బస్టాండ్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కె.లోకనాథంతో పాటు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల కార్యదర్శులు గోవిందరావు, రెడ్డి వేణు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాలకొండలోని ఆర్‌టిసి కూడలి వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అగ్రగామి స్టీల్ ఉత్పత్తి చేసే సంస్థగా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఉందన్నారు. తక్కువ మంది కార్మికులతో దేశంలోనే అత్యధిక ఉత్పత్తినిస్తున్న ప్లాంట్ మనదేనని అన్నారు. అంతేకాక ఉత్తరాంధ్ర ప్రజలకు, యువతకు ఉపాధి కల్పిస్తుందన్నారు. 32మంది బలిదానం, ఎంతోమంది త్యాగాలతో ఏర్పడిందని, అలాంటి సంస్థను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటు పరం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. కావున స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోవడానికి మన ప్రాంత ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వైసిపి, టిడిపి, జనసేన వ్యతిరేకించడం లేదన్నారు. మనం పోరాడి సాధించుకున్న ప్లాంటును రక్షించుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, పాలకొండ మండల కన్వీనర్ దావాల రమణ, కాద రాము, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి : సిపిఎం

బెలగాం : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొమ్మిదేళ్ల పాలనలో అటు కార్మికులకు, రైతాంగానికి, ఇటు వ్యవసాయ కూలీలకు ఎవర్నీ ఆదుకునే పరిస్థితి లేదని, రాష్ట్రంలో ఉత్తరాంధ్రాకు ఎంతో ఉపయోగకరమైన, అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసే బిజెపి ప్రభుత్వ చర్యలను ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకర్ అవుతున్నా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు స్పందించకపోవడం దురదకరమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం కాకుండా అడ్డుకోవాల్సిన పరిస్థితి ఎంతైనా ఉత్తరాంధ్ర ప్రజలపై ఉందని అన్నారు. ఇందులో భాగంగా సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఆరు జిల్లాల్లో 1150 కిలోమీటర్లు ఉక్కు రక్షణ బైకు యాత్ర చేపడుతుందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు పర్యటిస్తుందని తెలిపారు. శనివారం పాలకొండ చేరుకొని సభ అనంతరం అక్కడే బస చేస్తుందన్నారు. ఆదివారం ఉదయం 9గంటలకు కురుపాం, మధ్యాహ్నం 12 గంటలకు పార్వతీపురం చేరుకుంటుందని తెలిపారు. పార్వతీపురం నవిరి కాలనీ వై జంక్షన్ వద్ద నుండి బ్రిడ్జి, పాత బస్టాండ్ మీదుగా బెలగాం కాంప్లెక్స్ కూడలి వద్ద బహిరంగసభ జరుగుతుందని తెలిపారు. అనంతరం సాలూరుకు మధ్యాహ్నం 3.30 గంటలకు చేరుకుందన్నారు. కావున ఈ బైక్ యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిరా, జిల్లా కమిటీ సభ్యులు బంటు దాసు, గొర్లి వెంకటరమణ, రెడ్డి శ్రీదేవి, కె.రామస్వామి పాల్గొన్నారు.

బైక్ యాత్రలో సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు లోకనాథం

పాలకొండలో జరిగిన సభలో మాట్లాడుతున్న లోకనాథం

సాలూరురూరల్ : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఆపాలని సిపిఎం ఆధ్వర్యాన చేపడుతున్నఉత్తరాంధ్ర బైక్ యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మండలంలోని మామిడిపల్లిలో ప్రచారం నిర్వహించారు. బైక్ ర్యాలీ ఆదివారం సాలూరు పట్టణానికి చేరుకుంటుందన్నారు. కావున ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వంతల సుందర్రావు, తాడంగి గాసి, వ్యవసాయ కార్మిక సంఘం, మండల అధ్యక్షులు జన్ని ఈశ్వరరావు, గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు గూడెపు పోలిరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : పార్వతీపురంలో జరిగే ఉక్కు పరిరక్షణ బైక్ యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కొమరాడలో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మధుసూదన్ రావు, బి.వెంకటనాయుడు, సింహాచలం, ఆదిబాబు, సాయిరాం, అక్కులనాయుడు, స్వామినాయుడు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

ఎన్ఇపి ద్వారా విద్యాబోధన

ప్రజాశక్తి -సీతంపేట

నూతన విద్యావిధానంలో విద్యా బోధన సమర్ధవంతంగా నిర్వహించాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. నూతన విద్యా విధానంలో బోధన జరపడం కోసం ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, గురుకులం ప్రిన్సిపాళ్లకు స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో కోర్స్ డైరెక్టర్, ఉప విద్యాశాఖ అధికారి ఎ.లిల్లీ రాణి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం నిరంతరం జరుగుతుందన్నారు. డిడి మంగవేణి జ్యోతిప్రజ్వలన చేసి వృత్యాంతర శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒమరవిల్లి డైట్ ప్రిన్సిపల్ తిరుమల చైతన్య మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ, పేరెంట్స్ పాత్ర, శాలసిద్ధి గురించి తెలిపారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, పరిరక్షణ, వ్యాధుల నివారణ, భోజనాల్లో పోషకాలు గురించి వ్యాధి నిరోధక శక్తి గురించి అవగాహన కల్పించారు. ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ ఎన్.జాకబ్ దయానంద్ మాట్లాడుతూ వ్యాయామం గురించి ఫిజికల్ ఫిట్నెస్ దానివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. శిక్షణలో ఎటిడబ్ల్యుఒ కృష్ణవేణి, పిఎంఆర్‌సి సిబ్బంది, ఎఎంఒ కోటి బాబు, రాములమ్మ, ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్, సుబ్బారావు, నారాయుడు తదితరులు పాల్గొన్నారు

విచారణ వేగవంతం : పిఒ

బోగస్ ధ్రువపత్రాలపై విచారణను వేగవంతం చేస్తామని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. శనివారం డిఎల్ఎస్‌సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. మరిన్ని ఆధారాలను తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి మంగవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పాతబస్టాండ్ నుంచి నాలుగురోడ్ల కూడలి వరకూ ర్యాలీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చిట్ట చివరి అసెంబ్లీ సమావేశాల్లోనైనా మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, ఆప్కాస్ విధాన కార్మికుల సమస్యలు పరిష్కారం దిశగా చొరవ చూపలేదని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఆప్కాస్ విధానంలో కార్మికులుగా పని చేస్తూ చనిపోయిన వారి కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని, కార్మికులందరికీ ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా పర్మినెంట్ చేయాలని, అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 21 నుండి,25 వరకు ఆందోళనలో జరుగుచున్నవని అన్నారు. కార్యక్రమంలో కార్మికసంఘ నాయకులు చీపురుపల్లి సింహాచలం, మామిడి శివ, మంగళగిరి శ్రీను, గంగరాజు, బంగారి రాజేష్, ఎం.మజ్జి, పి.సత్తిరాజు, పి.నరేష్, పి.ఇప్పలమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

25న విజయవాడలో సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 25న విజయవాడలో సత్యాగ్రహ దీక్ష, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల సామూహిక సెలవుతో మండల కేంద్రాల వద్ద నిరసన దీక్ష జరుగుతుందని ఉపాధ్యాయ సంఘ నాయకులు శ్రీనివాసరావు, పాలక కష్ణారావు ఎంఇఒ ఆనందరావుకు శనివారం వినతి పత్రం సమర్పించారు. సమగ్ర శిక్ష, కెజిబివిల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ముసాయిదా బిల్లులో సమగ్ర శిక్షా, కెజిబివి ఉద్యోగులను చేర్చాలని, రెగ్యులర్, ఎంటిఎస్, డిఎ, హెచ్ఆర్ఎ అమలు, పెండింగ్ వేతనాలు విడుదల తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 25న విజయవాడలో ధర్నా చౌక్ వద్ద సత్యాగ్రహ దీక్ష జరుగుతుందన్నారు. ఈ దీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల సామూహిక సెలవులు పెట్టి నిరసన కార్యక్రమాన్ని తెలియజేయాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. ఈ దీక్షలకు సంఘీభావంగా అందరు సామూహిక సెలవులు పెట్టి మండల కేంద్రంలో నిరసనలు చేపట్టనున్నట్టు తెలిపారు.

నిమజ్జనాల్లో అశ్లీల నృత్యాలు చేయొద్దు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ పరిధిలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అశ్లీల, వికృత నృత్యాలు, విన్యాసాలు చేయొద్దని టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిజె సౌండ్స్ వినియోగిస్తూ వికృత నృత్యాలు, విన్యాసాలు చేయడం వల్ల ప్రాణాలు కోల్పోయే అవకాశం వుంటుందని చెప్పారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఇలాంటి విన్యాసాలు, నృత్యాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుందని సిఐ శ్రీనివాసరావు హెచ్చరించారు.

చిత్తశుద్ధి ఎంత?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

చిత్తశుద్ధి కలిగి చేసిన పుణ్యంబు కొంచెమైనను కొదవగాదు అన్నాడు కవి వేమన. కడవడైననునేమి ఖరముపాలు అని కూడా వ్యాఖ్యానించాడు. మండలాల్లో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాల సందర్భంగా అచ్చంగా వేమన శతకాలను గుర్తుచేస్తున్నారు ప్రజానీకం. సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేనప్పుడు ఇటువంటి కార్యక్రమాలు ఎన్నిచేసినా ఏమిటి ప్రయోజనం అని ప్రశ్నిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం పేరిట చాలా కాలం క్రితం నుంచి కొనసాగుతున్న గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని వైసిపి అధికారంలోకి వచ్చాక 'స్పందన'గా పేరు మార్చిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మే నెలలో దీనిపేరు జగనన్నకు చెబుదాం అంటూ మార్పుచేశారు. పేరు మార్చినా లక్ష్యం ఒక్కటే. ప్రజాసమస్యలు పరిష్కరించే వేదికగానే కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగానే జిల్లా కలెక్టర్ ప్రెస్‌మీట్ పెట్టిమరీ తమ వద్దకు వచ్చిన అర్జీలు, ఫిర్యాదులకు నిర్దిష్టమైన కాలపరిమితిలో పరిష్కారం చూపుతామని కూడా చెప్పారు. ఇందులో ప్రతి ఫిర్యాదారుడు లేదా అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా తమ చర్యలు ఉంటాయని కూడా ఉద్ఘాటించారు. మరింతగా ఆశలు పెంచుకున్న ప్రజానీకం వినతులు మండల, జిల్లా స్థాయిలో వెల్లువిరిశాయి. వాటి పరిష్కారం చూపడంలో మాత్రం అధికారులు, ముఖ్యంగా ప్రభుత్వం వెనుకబడింది. ముఖ్యంగా మన జిల్లాలో ప్రతి సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అందే వినతులపై సంతకాలు చేసి సంబంధిత అధికారులకు పంపడం మినహా వాటిపై పర్యవేక్షణ లేదు. దీంతో, వచ్చినవారే తిరిగి కలెక్టరేట్‌కు పదే పదే వస్తున్నారు. బహుశా రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండడం, మరోవైపు ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రభుత్వం ఇక నుంచి మండల స్థాయిలోనూ జగనన్నకు చెబుదాం అంటూ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించింది. ఇందులో భాగంగానే ఈనెల 13వ తేదీన రాజాంలోనూ, 15న బొబ్బిలిలోనూ, 20న ఎస్.కోట, 22న నెల్లిమర్లలోనూ జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు నిర్వహించారు. 27న గజపతినగరం, 29న చీపురుపల్లిలోనూ ఇదే కార్యక్రమం నిర్వహించనున్నారు. వీటికి జిల్లాలోని అన్ని శాఖల అధికారులూ కట్టగట్టుకుని వెళ్లారు. ప్రజల వద్దకు వెళ్లడం తప్పుకాదు. కానీ, ప్రజలే జిల్లా కేంద్రానికి వచ్చినప్పుడు పరిష్కరించని సమస్యలు, మండలానికి వచ్చి పరిష్కారం చూపుతామంటే ఎలా నమ్మాలి అంటూ జనం ప్రశ్నిస్తున్నారు. చివరకు కలెక్టర్ ఆదేశాలు తంగలో తొక్కడం, పరిష్కరించకుండానే పరిష్కరించి నట్టు నివేదికలు పంపడం వంటివి కూడా వెలుగులోకి వచ్చాయి. బహుశా ఇందుకేనేమో మండలాల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి స్పందన అంతంత మాత్రంగానే ఉంటోంది. ఇటీవల ఎస్.కోటలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మొత్తం 54 వినతులు మాత్రమే అందాయి. ఇందులో రెవెన్యూ 24వరకు ఉన్నాయి. దాదాపు ఈ అర్జీలన్నీ ఏడాదికి మించి కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నవారే కావడం విశేషం. హౌసింగ్ 13, సాంఘిక సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధికి సంబంధించి 3, వైద్యారోగ్య శాఖ 4, పంచాయతీరాజ్ శాఖ 2, ఐసిడిఎస్ 2 ఉన్నాయి. మే 9వ తేదీ నుంచి నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఈ మండలం నుంచి మొత్తం 315 వినతులు అందినట్టు అధికారులు చెబుతున్నారు. వీటిలో చాలా వరకు పరిష్కారం చేయకుండానే అర్జీదారులు సంతృప్తి చెందినట్టుగా అధికారులు రికార్డుల్లో నమోదు చేసుకుంటున్నారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అధికారులు కూడా తీవ్ర ఒత్తిడి, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి అధికారులు చేయాల్సిన పనికి జిల్లా స్థాయి అధికారులు ఎందుకంటూ కక్కలేక మింగలేక అధికారులు లోలోపల మదనపడుతున్నారు. మరోవైపు రోజుకో మండలం, మధ్యమధ్యలో సభలు, సమావేశాలతోనే కాలం గడిచిపోతోందని, శాఖ పరమైన పనులు చేయలేకపో ఒత్తిడికి గురౌతున్నామని కూడా చెబుతున్నారు. మరోవైపు ప్రజానీకం తల్లికి పట్టెడు అన్న పెట్టనివాడు పిన్నమ్మకు బంగారు గాజులు కొంటానని మాటిచ్చినట్టుగా జిల్లా కేంద్రానికి వచ్చినప్పుడే పరిష్కారం చూపలేనివారు మండలాలకు వచ్చి ఏం చేస్తారని జనం చర్చిస్తున్నారు. ఇదంతా ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆడిస్తున్న నాటకం తప్ప చిత్తశుద్ధి లేదన్నది పబ్లిక్ టాక్.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్ని కుతంత్రాలు, కుట్రలు పన్నినా ప్రజల తీర్పు మాత్రం చంద్రబాబు వైపేనని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయ్ చంద్ర అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో భాగంగా శనివారం స్థానిక పాత బస్టాండు నుండి జిల్లా కేంద్ర ఆసుపత్రి కూడలిలోనున్న అంబేద్కర్ విగ్రహం వరకు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున మహిళలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నాయకుడు చంద్రబాబు నాయుడు ఎలాంటి అవినీతికి పాల్పడలేదనడానికి ఆయన అరెస్టు అనంతరం, కేవలం రాష్ట్రం, దేశం నుండే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రజల నుండి లభిస్తున్న మద్దతే పెద్ద ఉదాహరణ అని అన్నారు. ప్రశ్నిస్తున్న నాయకులందర్నీ తప్పుడు కేసులతో జైలులో పెట్టాలని చూస్తున్న జగన్మోహన్ రెడ్డి తీరును ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే ఓట్ల రూపంలో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కె.నారాయణ రావు, బడే గౌరినాయుడు, తాతపూడి వెంకటరావు, కోల సరిత మధు, నాయకులు బార్నాల సీతారాం, జిల్లా ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు, బోను చంద్రమౌళి, పాలకొండ రాజశేఖర్, పోల సత్యనారాయణ, అమరాపు రామకృష్ణ గురజాన చంద్రమౌళి, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు. **కురుపాం :** స్థానిక టిడిపి కార్యాలయం వద్ద బిసి సెల్ ఆధ్వర్యంలో జరిగిన రిలే నిరాహార దీక్షలో నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం సాగిస్తున్న నిరంకుశ పాలనకు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి మరడాన తవిటి నాయుడు, పార్లమెంట్, నియోజకవర్గ బిసి సెల్ నాయకులు విజయకుసుం, గంగాధర్ నాయుడు, కెవి కొండయ్య, అక్కేన మధు, అంబటి రాంబాబు, ఘన్ముక చంద్ర పండా, పోలారు శ్రీనివాసరావు, బలగ రామకృష్ణ, కర్రి శ్రీను, కన్నా, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు. **వీరఘట్టం :** చంద్రబాబునాయుడుకు తోడుగా మేము సైతం కార్యక్రమంలో భాగంగా వీరఘట్టంలో పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, ఎఎంసి చైర్మన్ కృష్ణమూర్తి నాయుడు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పారిచర్ల వెంకటరమణ, మండల యువత అధ్యక్షులు మాచర్ల అనిల్ కుమార్, బల్ల హరిబాబు, తదితరులు పాల్గొన్నారు. **భామిని:** బాబుతో మేము కార్యక్రమంలో భాగంగా భామినిలో రిలే నిరాహార దీక్షలు జరిగాయి. ఈ దీక్షల్లో టిడిపి మండల అధ్యక్షులు భోగాపురపు రవినాయుడు మాట్లాడుతూ, చంద్రబాబును తక్షణమే విడుదల చేయాలనీ, వాస్తవాలు వక్రీకరించి అక్రమ అరెస్ట్ ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, కోరాడ రాజేష్, భూపతి ఆనందరావు, కొల్ల మధు, కొల్ల నవీన్, పొత్తక మహేష్, గెల్లంకి మాధవరావు, పొత్తక చిరంజీవులు, ఈగల సోమేశ్వరావు, కార్యకర్తలు పాల్గొన్నారు. **సీతంపేట :** మండలంలోని కుసిమిలో బాబుతో నేను కార్యక్రమాన్ని టిడిపి నియోజకవర్గ నాయకులు భూదేవి చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బి జయలక్ష్మి, కె విశ్వనాథం మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంలో మహిళలతో భారీ ర్యాలీ

పార్వతీపురంలో నిరసన ర్యాలీ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

పనులను పరిశీలిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

నాడు-నేడు పనులు వేగవంతం : డిఇఒ

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని చేపడుతున్న నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శనివారం స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల, కెజిబివి పాఠశాలలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేయాలన్నారు. రెండో విడత (ఎ)కు మరో 558 పాఠశాలల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ మర్రాపు సత్యనారాయణ

ఆలయ పనులు పరిశీలన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలం తోటపల్లిలో కోదండరామ స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చైర్మన్ మర్రాపు సత్యనారాయణ పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని శిల్పులను కోరారు. విద్యుత్ సమస్యల దృష్ట్యా జనరేటర్ మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని మెకానిక్‌లకు సూచించారు. నిత్య అన్నదానం కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం పట్టణానికి చెందిన ద్వారపురెడ్డి శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాలను చైర్మన్ పలువురి భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్, ధర్మకర్తలు గంటేడ సింహాచలం, కుసుమూరు శ్రీధర్ పాత్రో, గౌరీశంకర్ పాత్రో పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థిని రాష్ట్రస్థాయికి ఎంపిక

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక మోడల్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వి.పూజిత రాష్ట్రస్థాయి నేషనల్ సైన్స్ సెమినార్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ స్వర్ణలత తెలిపారు. నేషనల్ సైన్స్ ఫేర్ వారు నిర్వహించిన మిల్లెట్స్ ఏ సూపర్ ఫుడ్ ఫర్ డైట్ ఫుడ్ అనే అంశంపై మండలంలో, జిల్లాలో మొదటి స్థానం సంపాదించిన పూజిత రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

అర్బన్ బ్యాంక్ మహాజన సభ

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక అర్బన్ కోపరేటివ్ బ్యాంక్ మహాజన సభ శనివారం బ్యాంక్ కార్యాలయంలో జరిగింది. బ్యాంక్ డైరెక్టర్ పువ్వుల శ్రీనివాస్ భరత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు ఆడిట్ రిపోర్ట్‌ను ఆమోదించారు. ఈ సమావేశంలో బ్యాంక్ కార్యదర్శి బి.వేణుగోపాలరావు, డైరెక్టర్లు కె.రామకష్ణ, పి.మాలతి పాల్గొన్నారు.

అన్న సమరాధనకు రూ.50 వేలు వితరణ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీ కురుపాంలో గల శివన్నపేట గ్రామ రాజుల వీధి వినాయక ఉత్సవ కమిటీకి అన్న సమరాధన నిమిత్తం టిడిపి యువ నాయకులు వైరచర్ల వీరేష్ చంద్రదేవ్ రూ.50వేలు నగదు అందజేశారు. శనివారం శివన్నపేటలో స్థానిక యువత, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భారీగా అన్న సమరాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కురుపాం పరిసర ప్రాంతం ప్రజలు వచ్చి అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశుదాణా విక్రయ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పట్టణంలోని పలు పశుదాణా విక్రయ కేంద్రాలను పశు వైద్యాధికారి డాక్టర్ భోగి చక్రధర్ ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. పశుదాణా విక్రయ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించిన, ఐఎస్ఐ మార్కులతో కూడిన దాణా విక్రయాలు చేపడుతున్నారా లేదా అని తనిఖీలు నిర్వహించామని ఆయన తెలిపారు. పశుదాణా నమూనాలను సేకరించి వాటిని నెల్లూరు ల్యాబ్‌కు పంపిస్తామని అన్నారు.

దాణాను పరిశీలిస్తున్న వైద్యుడు చక్రధర్

రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

సచివాలయాల్లో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ కుళాయి పన్ను, ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ టి.జయరాం ఆదేశించారు. శనివారం ఆయన పట్టణంలోని 3,4 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇంటి పన్ను, కుళాయి పన్నులను వందశాతం వసూలు చేయాలని ఆదేశించారు. పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు.

ముగ్గులు పోటీల్లో పాల్గొన్న మహిళలు

స్వచ్ఛతపై ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - సాలూరు

భారతీయ స్వచ్ఛత 2.0, స్వచ్ఛత హోయి కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పట్టణ ంలోని మహిళలకు ముగ్గుల పోటీ లు నిర్వహిం చారు. పట్టణంలోనీ పలు వార్డుల నుంచి వచ్చిన మహిళలు పరిశుభ్రత, స్వచ్ఛతపై వేసిన ముగ్గులను మున్సిపల్ కమిషనర్ టి.జయరాం, మేనేజర్ రాఘవాచార్యులు, శానిటేషన్ ఇన్ స్పెక్టర్ ఫకీర్ రాజు, మెప్మా సిఎంఎం ఎ.పుష్ప పరిశీలించారు.బాగా ముగ్గులు వేసిన ముగ్గురు మహిళలకు బహుమతులు అందజేశారు.

రీ సర్వేలో తప్పులు... రైతులకు తిప్పలు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలో జరుగుతున్న భూరీసర్వే అంతా తప్పుల మయమని, దీంతో రైతులకు తిప్పలు తప్పడం లేదని ఎంపిపి ఉరిటి రామారావు రెవెన్యూ సిబ్బంది తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత జరిగిన రెవెన్యూ, విద్యుత్‌శాఖలకు సంబంధించిన సమస్యలపై పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. పొంతన లేని సమాధానం చెప్పడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే చెప్పి, కాలం వెళ్ళబుచ్చారు. వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో ఈక్రాప్ సక్రమంగా జరగడంలేదని, ఇ క్రాప్ సమయంలో రైతులను సంప్రదించడంలేదని అన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచాలని నాగూరు ఎంపిటిసి ద్వారపురెడ్డి సత్యనారాయణ కోరారు. ఎంపిపి మాట్లాడుతూ రెవెన్యూకు సంబంధించిన పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతుందని తహశీల్దార్ గేదెల వెంకట జనార్ధన్‌ను ప్రశ్నించారు. గొట్టివలస, ఉల్లిభద్ర రెవెన్యూ పరిధిలోని కొండను అటవీ శాఖకు, మైన్స్ వారికి ఇవ్వడం వల్ల తాముతీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని సుంకి సర్పంచ్ కరణం రవీంద్ర తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. బురద వెంకటాపురం ఎంపిటిసి సభ్యులు చింతల రూపవతి మాట్లాడుతూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. నాగూరు సర్పంచ్ కేతిరెడ్డి శిరీష మాట్లాడుతూ ఇంటి స్థలాలకు కేటాయించిన స్థలాన్ని ఇంద్రాణి క్లస్టర్ రైస్ మిల్ అసోసియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున కామన్ ఫెసిలిటీ నిర్మాణానికి కేటాయించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.అలాగే తమ విఆర్‌ఒ సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం పట్ల ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూపరమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నామని హామీ ఇచ్చారు. రావివలస, గరుగుబిల్లి పిహెచ్‌సిల వైద్యాధికారులు డాక్టర్ కర్రి అరుణకుమారి, డాక్టర్ కయనీకరోతు సాగర్ వర్మ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు కోరారు. వల్లరిగుడబలో మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులకు తెలియకుండా వైయస్సార్ కాంతి పథం క్లస్టర్ కోఆర్డినేటర్ స్త్రీ నిధి రుణాలు మంజూరు చేశారని, అది ఎలాసాధ్యమని సర్పంచ్ గోవిందనాయుడు ఎపిఎంను ప్రశ్నించారు. పెద్దూరు, వల్లరిగొడవలో స్థలాలు కేటాయించినప్పటికీ, విద్యుత్ శాఖ కాలనీకి కనెక్షన్లు ఇవ్వడం లేదని,ఇలా అయితే పేదల కల ఎలా నెరవేరుతుందని సర్పంచ్ ఎల్లం నాయుడు ప్రశ్నించారు. సమావేశంలో ఎంపిడిఒ జి.పైడితల్లి, పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.సురేష్ కుమార్, ఎంఇఒ నగిరెడ్డి నాగభూషణరావు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రెవెన్యూ తీరుపై ఎంపిపి అసంతృప్తి

మండల సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహన్‌రావు

యోగా తప్పని సరి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలో ఆరోగ్య కార్యక్రమాలు పక్కగా నిర్వహించి, ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు శనివారం తెలిపారు. ఈ మేరకు ఆయన సన్యాసిరాజుపేటను ఆకస్మికంగా సందర్శించి అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై, వైద్య సిబ్బంది చేపడుతున్న పలు ఆరోగ్య కార్యక్రమాలపై ఆరా తీశారు. ఆయుష్మాన్ భవఃలో భాగంగా వైద్య సిబ్బంది చేపట్టిన ఆరోగ్య మేళా కార్యక్రమాలను, ఆరోగ్య తనిఖీలను పరిశీలించారు. ఆయుష్మాన్ భవ హెల్త్ ఐడిలు గ్రామంలో ఎంత మందికి పూర్తి చేశారని సిబ్బందిని అడిగి, అందరికీ హెల్త్ ఐడిలు పూర్తి చేయాలన్నారు. అక్కడ నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్యానికి యోగా ఆవశ్యకతను వివరించారు. అనంతరం ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ఏ మేరకు నిర్వహించారని తెలుసుకొని ప్రతి కుటుంబం ఆరోగ్య సర్వే పక్కాగా చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే ఆరోగ్యశ్రీ యాప్ అందరికీ డౌన్లోడ్ చేయించి వివరించాలన్నారు. నెలాఖరు నుంచి నిర్వహించనున్న జెఎఎస్ శిబిరాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అక్కడ ప్రజల తో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లల బరువు, ఎత్తు నమోదు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి.ప్రియాంక, సూపర్ వైజర్లు ఎవి రవణమ్మ, జయగౌడ్, వైద్య సిబ్బంది రవణమ్మ, ఇంద్రాణి, రమేష్, 104 సిబ్బంది దుర్గా ప్రసాద్, అనీల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గోతులు పూడ్చాలంటూ ఆందోళన

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద పెద్ద గుంతలను పూడ్చి ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు శనివారం ఆందోళన చేపట్టారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, స్థానికులు గొంపా అనిల్ కుమార్, జి.ప్రకాష్, ఆర్.శంకరరావు ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ఈ సందర్భంగా కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ రోడ్డుపై పెద్దపెద్ద గుమ్ములు ఏర్పడడంతో నడవడం కూడా కష్టంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ద్విచక్రవాహనాలపై ప్రయాణం నరకయాతనంగా మారందని, అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే వర్షాకాలంలో భూముల్లో నీరు నిల్వ చేరి ప్రమాదకరంగా మారిందని, దీంతో విష జ్వరాలు, డెంగీ వంటి ప్రమాదకరమైన రోగాల బారినపడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాష్ట్ర ప్రభుత్వంతో ఒత్తిడి తెచ్చి వెంటనే రోడ్డు నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని, కాలువలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

పగడ్బందీగా స్వచ్ఛత సేవ

ప్రజాశక్తి - సీతంపేట

స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం డిపిఒ బి.సత్యనారాయణ చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. స్వచ్ఛత సేవా కార్యక్రమం పగడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా సిబ్బందిని అభినందించారు. అనంతరం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నగదు రహిత కార్యక్రమంపై కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నగదు రహిత కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఎంపిడిఒ కె. సత్యం మాట్లాడుతూ గ్రామాల్లో నగదురహిత కార్యక్రమంపై కార్యదర్శులు అవగాహన కల్పించాలని చెప్పారు. క్యాస్ లెస్ కార్యక్రమంపై పంచాయితీల్లో ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.కళావతి కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరం సందర్భంగా నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్, టెక్నాలాజికల్ మ్యూజియం, బెంగళూరు వారు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న నేషనల్ సైన్స్ సెమినార్-2023 లో భాగంగా శనివారం చిరుధాన్యాలు ఒక మంచి పోషకాహారం, ఒక వ్యామోహం అన్న అంశంపై స్థానిక డివిఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ చిరుధాన్యాల ఆవశ్యకతను ఇప్పటికైనా ప్రపంచం గుర్తించాలని, మానవుని ఆరోగ్యంపై చిరు ధాన్యాలు ఎంత అనుకూల ప్రభావం చూపుతుందో సామాన్య మానవునికి సైతం తెలియజేయడానికి ఇటువంటి జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించడం జరుగుతోందని అన్నారు. విద్యార్థి దశ నుండే చిరు ధాన్యాల ఆవశ్యకతను తెలుసుకుంటే చక్కనైన ఆరోగ్యంతో మరింత రాణించడానికి అవకాశం కలుగుతుందని అన్నారు. జిల్లా సైన్సు అధికారి జి.లక్ష్మణరావు మాట్లాడుతూ మండల స్థాయి సెమినార్లలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయి సెమినార్‌కు హాజరయ్యారని చెప్పారు. జిల్లా సెమినార్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన మక్కువ మోడల్ స్కూల్‌కు చెందిన వి.పూజిత ఈ నెల 25న విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎంఇఒలు వై.విమల కుమారి, కె.ప్రసాద్, జిల్లా అప్కాస్ట్ కోఆర్డినేటర్ పి.రామకృష్ణ, డివిఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవింద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

పేదల ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని దయానిధిపురం పంచాయతీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల్లో భాగంగా పేదల సొంత ఇల్లు కలను నెరవేర్చాలని ఉద్దేశంతో ప్రతి పేదవానికి ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొని సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలన్నారు అన్నారు. అలాగే రైతు సమస్యలపై స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ టి.రామారావు, పెదభోగిలి ఉప సర్పంచ్ కె.అరవింద్ కుమార్, నిడగల్లు మాజీ సర్పంచ్ గాజువాక వెంకటనాయుడు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న చైర్మన్

ఉత్సవాల్లో ఆటలు పోటీలు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీ కురుపాంలో గల శివన్నపేటలో వినాయక ఉత్సవ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు, మహిళలకు ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు హాజరై ఆటల పోటీలను తిలకించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు ఆయన సొంత నిధులతో అందజేశారు. ఈ సందర్భంగా శివన్నపేట గ్రామ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుపాం గ్రామానికి కోటిబాబు సేవలు మరువలేవని కొనియాడారు. కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి.జయరాం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను శనివారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కమిషనర్‌కు సూచించారు.

కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న కమిషనర్

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన సికిల్ సెల్ ఎనీమియా అనే వ్యాధిపై స్థానిక ఎహెచ్ఇ కె.నాగమణిచే విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు సికెల్ సెల్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని అలానే తమ కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ వ్యాధి వస్తే ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ బీ.జయమణి, ఐక్యూ ఎసి కో-ఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు ఎం.శాంతి,.పి.రామారావు, పి.జమ్మయ్య, పి.ఉపేంద్ర, ప్రశాంతి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎహెచ్ఇ కె. నాగమణి

నడిమికెళ్లలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం: మండలంలోని నడిమికెళ్లలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతకుమారి, ఎఎన్ఎం బి.శకుంతల, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

25న మెగా నేత్ర వైద్య శిబిరం

వీరఘట్టం: మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయిబాబా మందిర ఆవరణలో ఈనెల 25న మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహకులు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నామని తెలిపారు. దీర్ఘకాలిక కంటి రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

కృష్ణరాయపురంలో ఉచిత వైద్య శిబిరం

సీతానగరం: మండలంలోని కృష్ణరాయపురంలో బూర్జ ఆయుర్వేదిక వైద్య అధికారి టి.యామాసి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేదిక వైద్యం ద్వారా ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవని దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయన్నారు. రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గునుపూరు అన్నంనాయుడు, గ్రామ పెద్దలు, ప్రజలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

అంటు వ్యాధులు ప్రబలకుండా అవగాహన

పార్వతీపురంరూరల్ : గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పిస్తున్నామని వైద్యాధికారి ఐశ్వర్య అన్నారు. మండలంలోని వెలగవలస పంచాయతీ పిండిలోవలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్య పరీక్షలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్న కారణంగా గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. గిరిజనులు క్రమం తప్పకుండా వేడి చేసి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలన్నారు.